క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


జయంతి

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందీ అధ్యాపకురాలు పి.ఎం.ఆర్. జయంతికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీయూ హిందీ ఆచార్యులు డా. రాంప్రకాష్ ఆధ్వర్యంలో ×సంజీవ్ కి కహానియోం మే మానవీయ సంవేదన€ అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ఆమెను అభినందించారు.

10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, తాలుకా జోన్ కార్యదర్శి సావంత్ సుధాకర్ డిమాండు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు వారు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం వ్యక్తిగత అర్జీల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రవీంద్ర నగర్ 41, 42, 43 డివిజన్ పరిధిలో సీపీఐ నాయకులు పర్యటించారు. అర్హులైన లబ్ధిదారులను కలిసి వ్యక్తిగత అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కే.లింగన్న, నాయకులు హనుమంతు, రాముడు, శశి, రెడ్డి భాష ,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4, 7 ఆధ్వర్యంలో కడప నగరంలోని సాయిబాబా అనాథ శరణాలయంలో పిల్లలకు దుప్పట్లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా యోగివేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె. లలిత, డా.ఎస్. సునీత చేతుల మీదుగా వీటిని అందజేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని వారు పేర్కొన్నారు. క్రమశిక్షణతో చక్కగా చదువుకొని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు అశ్వత్ రెడ్డి, అనాథ శరణాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారం


రేణుదేశాయ్ నుంచి పురస్కారం అందుకుంటున్న చంద్రావతి

కడప స్పోర్ట్స్: మైదుకూరు పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ గైడ్ కెప్టెన్ చంద్రావతికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శుక్రవారం విజయవాడలో భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, సినీనటి రేణుదేశాయ్ చేతుల మీదుగా ఈమె పురస్కారం అందుకున్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

వైవీయూ: జిల్లాలో నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ యూనివర్సిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొన్ని కళాశాలలు బీఈడీలో ప్రవేశాలు చేసుకుంటున్నాయన్నారు. కళాశాలలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు వారు ప్రవేశం పొందిన కళాశాల ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కళాశాల యాజమాన్యాలు పీఆర్‌ఓలను నియమించుకుని బయట రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు చేసుకుని, ఎలాంటి తరగతులు నిర్వహించకుండా పరీక్షలు నిర్వహించేసి సర్టిఫికెట్‌లు ఇచ్చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యోగి వేమన యూనివర్సిటీ అధికారులు విచారణ చేసి నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పవన్, విష్ణు, మార్టిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయురాలు సావిత్రిబాయి


పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ: తరతరాలు గుర్తుంచుకునే ఆదర్శనీయురాలు సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. భారతదేశం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194 జయంతి కార్యక్రమం వైవీయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో సైన్సు బ్లాకులోని సెమినార్ హాల్లో నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి చిత్రపటానికి అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. వైవీయూ బీసీ సెల్ అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలికలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని స్వేచ్ఛగా సన్మార్గంలో నడవాలని సూచించారు. ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ 194 ఏళ్ల తర్వాత కూడా సావిత్రిబాయి పూలేని స్మరించుకుంటున్నామంటే ఆమె తీసుకొచ్చిన సంస్కరణలు, ఆదర్శనీయ భావాలు అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆమె చదువుతో పాటు కవిగా రచయితగా అద్భుతమైన రచనలు చేశారని వాటిలో కొన్నింటిని ఉటంకించారు. ప్రధాన వక్తగా హాజరైన తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజి రీడర్, విశ్రాంత సహ ఆచార్యులు డా. వి.ఆర్. రాసాని మాట్లాడుతూ బాలిక విద్య కోసం, సమసమాజ స్థాపన కోసం పూలే దంపతులు చేసిన కృషి అజరామరమని ఉద్ఘాటించారు. సభా కార్యక్రమంలో అతిథులను బీసీ సెల్ ప్రతినిధి డాక్టర్ సుభోస్ చంద్ర ఆహ్వానించగా డాక్టర్ జి. పార్వతి వందన సమర్పణ చేశారు. అనంతరం ప్రధాన వక్త డాక్టర్ వి.ఆర్. రాసానిని విశ్వవిద్యాలయం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ సభ్యులు డా.గంగయ్య, సరళ, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : మహిళా విద్యకోసం సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని కడప ప్రకాశ్‌నగర్ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జేవీ రమణ, వైఎం ప్రతాప్‌రెడ్డి, సంగటి మనోహర్, పీవీ రమణ, అమీన్‌పీరా, బీసీ గంగులు, కైపు రామాంజనేయులు, పెద్దుళ్లపల్లి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో..

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సావిత్రీబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలో మహిళల విద్యకోసం పోరాడిన గొప్ప యోధురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. రిజిస్ట్రార్ ఎస్. రాజేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల మహిళలను బానిసత్వం నుంచి కాపాడిన వ్యక్తి సావిత్రీబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్, జనవిజ్ఞానవేదిక సమతావిభాగం సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా సావిత్రీబాయి మహిళల విద్యకు చేసిన మేలు గురించి వివరించారు. కడప సిటిజన్ ఫోరం అధ్యక్షుడు డా. ఓబుల రెడ్డి, జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం కన్వీనర్ సునీత, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దీప్తిలు మాట్లాడుతూ మహిళల సాధికారత, సావిత్రీబాయి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను పొందిన డా. జి. విజయలక్ష్మి దేవి, డా. పి. శచీదేవీ, పార్లమెంట్‌లో ప్రసంగించిన సానియ, ఎన్ఎస్ఎస్ బెస్ట్ వలంటీర్ వందనను సన్మానించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు శివరాం, బుద్దిస్ట్ కల్పిత సొసైటీ నాయకుడు మల్లెల భాస్కర్, కళాశాల అధ్యాపకులు డా.నాగరత్న, సి.వి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం కృషి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మహిళా సాధికారత కోసం సావిత్రిబాయి ఎంతో కృషి చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శివ శంకర్, జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు అఖిరానందన్, తేజ, నగర ఉపాధ్యక్షులు అశోక్, మస్తాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : దేశంలో తొలి ఉపాధ్యాయినిగా స్త్రీ విద్య అభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం నిర్వాహకులు రఫీ అన్నారు. శుక్రవారం పాత రిమ్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.

జేవీవీ ఆధ్వర్యంలో..

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి జయంతిని సంస్థ రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, ఎంఈఓ గంగిరెడ్డిలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాలలోని విద్యార్థుల కు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రుక్సాన, ఇమాంబీ, సుమ విజేతలుగా నిలిచారు.

కడప ఎడ్యుకేషన్: అణగారిన జీవితాలలో వెలుగులు నింపిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బమ్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు అన్నారు.

– చదువుల తల్లి, ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని జిల్లా ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎస్టీయూ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష, ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మహబూబ్ బాషా, రీజినల్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్, ఉపాధ్యాయులు మరియా రాణి, జాకీరా ఖానం రకీబున్నిసా, ఫామ్మిద పర్వీన్ తాహెరా, షేక్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎఫ్‌యూలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్


ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ దీప్తి


విజేతలైన విద్యార్థులతో జేవీవీ ప్రతినిధులు


సాయిత్రిబాయి చిత్రపటానికి పూలమాల అలంకరిస్తున్న రఫీ తదితరులు


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి


సావిత్రిబాయి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

నేటి ధర్నా విజయవంతం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఈ డీఈఓ మాకొద్దు అనే నినాదంలో శనివారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించే , ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం నిలుపుకునే విధంగా ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని ఉపాధ్యాయ సంఘాల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమం ఏర్పాట్లను ఉపాధ్యాయ వేదిక సంఘ నాయకులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మోపూరి శివారెడ్డి, గుజ్జల తిరుపాలు, ఆపస్ నాయకులు వెంకటరామిరెడ్డి , పీఎస్‌టీయూ నాయకులు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మండలం చిన్నచౌకు పరిధిలోని జయనగర్ కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని కడప తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో తహసీల్దార్‌తోపాటు సిబ్బంది చిన్నచౌకు గ్రామ రికార్డులతో హాజరవుతారన్నారు. సదస్సులో చిన్నచౌకు ప్రాంతంలో భూములు గల రైతులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం


మంత్రిని సన్మానిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటిలో ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో కార్మికులు మంత్రిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు నైట్ అవుట్ అలవెన్సులు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ పీవీఎస్ నారాయణ, రీజినల్ ప్రెసిడెంట్ ఏపీఎన్ రెడ్డి, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల కిశోర్‌బాబు, రాజేంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

సీమ ఘనతను చాటిన యువతులు


కవితల పోటీ విజేతలతో నిర్వాహక బృందం

కడప కల్చరల్ : రాయలసీమ భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళలు తదితర అంశాలపై నిర్వహించిన కవితా పోటీల్లో మహిళలు సీమ ఔన్నత్యాన్ని ఘనంగా చాటి చెప్పారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జరగనున్న వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభల్లో ఏర్పాటుచేసిన శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా శుక్రవారం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాష ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినిలకు కవిత రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు అధ్యాపకులు డాక్టర్ జి వీరయ్య, డాక్టర్ నాగసుధారాణి పర్యవేక్షణలో నిర్వహించామని డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, కల్లూరు బాల ఎల్లారెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. ఈ పోటీల్లో కీర్తి, సోనీ, సుస్మితలు విజేతలుగా నిలిచారని, వీరికి మహాసభల్లో నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. వీరితో పాటు మానస, సౌమ్య, సయ్యద్ సానియా, పవిత్ర, నాగ శిరీష, లక్ష్మీనారాయణి, లావణ్య, యాగ్నిక, గురుస్వాతిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జయంతి, డాక్టర్ షార్జియా బేగం తదితరులు పాల్గొన్నారు.

దళితవాడ ప్రజలకు దేవతా విగ్రహాలు


విగ్రహాలను అందజేస్తున్న జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్

కడప కల్చరల్ : మాధవరంలోని దళితవాడ ప్రజలకు వైఎస్సార్ జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు, రాయలసీమ దేవాలయాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ విజయభట్టర్ దేవతా మూర్తుల విగ్రహాలను అందజేశారు. శుక్రవారం కడప నగరంలోని తన ఇంటిలో ఆయన రూ. 2 లక్షలు విలువ జేసే శ్రీరామ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను మాధవరం దళితవాడ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలోని దళితులు పదేళ్ల కిందట రామాలయాన్ని నిర్మించుకున్నారని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విగ్రహాలు కొనలేక పోయారన్నారు. వారి విషయాన్ని కడప నగరానికి చెందిన పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది సట్టి భారవి ఇటీవల తనకు విషయాన్ని తెలియజేశారన్నారు. తాను స్పందించి విగ్రహాలను అందించానన్నారు. ఈ కార్యక్రమంలో సట్టి భారవి , అర్చక పురోహిత సమాఖ్య ప్రతినిధులు తివిక్రమ్ భట్టర్, కొప్పర్తి రవి, వరప్రసాద్‌శర్మ, ఇంద్రగంటి ప్రభాకర్‌శర్మ, మధుభారతం సుధీర్‌శర్మ, కిరణ్‌కుమార్‌శర్మ, సాగర్, మోహనాచార్యులు, కార్తీక్, సట్టి భాస్కర, తులసీశ్వరరెడ్డి, బాలకృష్ణ, రాఘవేంద్రవర్మ, మాధవరం దళితవాడ ప్రజలు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి


రాజీవ్ రంజన్‌మిశ్రాకు వినతిపత్రం సమర్పిస్తున్న డాక్టర్ శ్యామూల్‌బాబు

కడప రూరల్ : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళిత క్రిస్టియన్ ఫోరం నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ కె శామ్యూల్ బాబు, కన్వీనర్ పీఎండీ ప్రసాద్ కోరారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఢిల్లీ నుంచి కడపకు వచ్చిన వన్‌మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ను కడప కలెక్టరేట్ సభా భవనంలో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిషప్ శామ్యూల్ బాబు, పీఎండీ ప్రసాద్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల ఎస్సీ స్టేటస్‌ను 1950 లో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇందులో సిక్కులకు, బౌద్ధులకు తొలగించి మళ్లీ పునరుద్ధరించారని గుర్తు చేశారు. కానీ దళిత క్రైస్తవులకు నేటికీ కల్పించ లేదని చెప్పారు. దీంతో తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాకే వర్గీకరణ చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కడప అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. కడప రిమ్స్ పీఎస్ పరిధిలో బుడ్డాయి పల్లె క్రాస్ వద్ద ఈనెల ఒకటో తేదీ రాత్రి వల్లూరు మండలం గోటూరు కు చెందిన మణికంఠ (22), తన సోదరుడు వంశీతో కలిసి కడపకు మోటార్ సైకిల్ పై వచ్చారు. వై జంక్షన్ సమీపంలో జుడియాలో షాపింగ్ చేశారు. తర్వాత ఇద్దరూ కలిసి బుడ్డాయిపల్లి లో ఉన్న తన అవ్వగారింటికి వస్తుండగా రాజంపేట వైపు నుంచి పల్సర్ బైక్ లో వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మణికంఠ రిమ్స్ లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. రిమ్స్ ఎస్ఐ జయరాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..





కడప రూరల్: ఆ దారిలో ఫుట్‌పాత్ మీద నడిచే వారికి కంటి ముందరే కనిపించని ప్రమాదం పొంచి ఉంది. ఆర్ట్స్ కాలేజీ మైదానం నుంచి వెళ్లే దారిలో పాడుబడిన కాలేజీ హాస్టల్ భవనం ఉంది. దాని ముందర రిమ్స్‌కి వెళ్ళే ప్రధాన దారి ఫుట్ పాత్ పైన నడిచి వెళ్లే మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. ఫుట్‌పాత్‌కు మధ్యలో ఖాళీ ప్రదేశం ప్రమాదకరంగా ఉంది. దీని కింద ఒక కాలువ ఉంది. పొరపాటున ఇక్కడ కాలు పెడితే ప్రమాదం సంభవించడానికి అవకాశం ఉంది. ఈ ఫుట్‌పాత్‌పై అనునిత్యం ప్రజలు నడకను సాగిస్తుంటారు. దగ్గరికి వెళ్ళినంత వరకు ప్రమాదం కంటి ముందు ఉన్న సంగతి గమనించలేరు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీ కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీ కీలకం అని కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ పాఠశాలలో ఎంఈఓలు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయాలన్నారు. దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి దోహదపడేలా కమిటీని తయారు చేయాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ అపర్ణ సనావుల, శ్రీనివాసులురెడ్డి, కాశీంలు తల్లిదండ్రుల కమిటీ బాధ్యతలు, విధి విధానాలు, చేయవలసిన పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు విశ్వనాథరెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజ కోన సమస్యలు పరిష్కరించాలి

కడప కల్చరల్ : జిల్లాలో అత్యంత వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించే నిత్యపూజకోనలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని నిత్యపూజకోన పరిరక్షణ సంస్థ ప్రతినిధి చెన్నంశెట్టి మురళి కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిత్యపూజకోనలో మంచినీరు, రహదారి, పారిశుద్ధ్యం తదితర కనీస వసతులు కల్పించేందుకు స్థానిక దేవదాయ ధర్మదాయశాఖ అధికారులతోపాటు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి చొరవ చూపాలని కోరారు.

రిజర్వేషన్ ఫలాలు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మాదిగల ఉపకులాలకు రాజ్యాంగం అందించిన రిజర్వేషన్ ఫలాలు అందించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ అధ్యక్షులు తప్పెట శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, రాష్ట్ర సభ్యులు మిద్దె వెంకటరమణ కోరారు. శుక్రవారం కడపకు విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలసి తమ నివేదికను అందజేశారు.

సరస్వతీదేవిగా వాసవీమాత


శ్రీసరస్వతిదేవీ అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీమాత

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాసం 3వ శుక్రవారం పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆర్.సురేంద్ర ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీమాత మూల విరాట్ అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరించి, ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. ఉదయం 5 గంటలకు దశ హారతులు, మంత్రపుష్పం వేద మంత్రోచ్చరణతో పూజలు నిర్వహించారు. వాసవీమాతను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కాలేజీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య మహిళలు కుంకుమ పూజ, కుంకుమార్చన, లలితా సహస్ర నామాలు, వాసవీ అష్టోత్తర నామావళి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామిగుప్తా, పవర్ లిఫ్టింగ్ కోచ్ గోవిందు తివారీలు తెలిపారు. విజయవాడ కృష్ణలంకలోని జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీకి చెందిన పీయూసీ–2 విద్యార్థి మహబూబ్ ప్రతిభను చాటాడని, అలాగే శివకుమార్, వైష్ణవి పవర్ లిఫ్టింగ్ పోటీలలో రాణించి బంగారు పతకం సాధించారని డైరెక్టర్ తెలిపారు. అలాగే ఒంగోలు క్యాంపస్‌లోని పీయూసీ– 2 విద్యార్థులు తేజస్విని, చందన పతకాలను గెలుచుకున్నట్లు తెలిపారు. పరిపాలన అధికారి రవి కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగ డీన్ అకడమిక్ రమేష్ విజేతలను అభినందించారు.